# సాక్షి విశాఖపట్నం

శనివారం । 11 । నవంబర్ । 2023




## న్యూస్‌రీల్

### అందరికీ విజయాలు చేకూరాలి



మహారాణిపేట: ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు,చెడుపై మంచి,అజ్ఞానంపై జ్ఞానం,దుష్ట శక్తులపై దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఈ పండుగతో ప్రజల జీవితాల్లో ఆనంద కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులతో ప్రతి కుటుంబం సుఖ, సంతోషాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు.

### స్వచ్ఛ దీపావళి జరుపుకుందాం



దాబాగార్డెన్స్: స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 మార్గదర్శకాల్లో భాగంగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనలకు అనుగుణంగా ప్రజలందరూ దీపావళి పండగను స్వచ్ఛ దీపావళి–శుభ్ దీపావళిగా జరుపుకోవాలని పిలుపునిస్తూ ప్రచారాన్ని ప్రోత్సహిస్తోందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ విషయమై విశాఖ నగరంలో ప్రజల అవగాహనకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచించిన స్వచ్ఛ దీపావళి–శుభ్ దీపావళి ప్రతిజ్ఞ https://pledge.mvgov.in/swachh&diwali&shubh&diwali/ ద్వారా జీవీఎంసీ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తుందన్నారు. విశాఖ నగరంలో దీపావళి వేడుకలు సందర్భంగా కాలుష్యాన్ని అరికట్టేందుకు జీవీఎంసీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

### 13న 'జగనన్నకు చెబుదాం' రద్దు

మహారాణిపేట: ఈనెల 13వ తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. దీపావళి సందర్భంగా సోమవారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి, జిల్లా ప్రధాన కేంద్రానికి రావొద్దని కలెక్టర్ సూచించారు.

### కనకమహాలక్ష్మితత్వంపై ప్రవచనాలు



ప్రవచనాలు చేస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మిని నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం కనకమహాలక్ష్మి తత్వంపై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 14న అప్రెంటిస్ షిప్ మేళా

కంచరపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో ఐటీఐలో ఈ నెల 14న కంచరపాలెంలో ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నామన్నారు. వివిధ ట్రేడుల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ 9 గంటలకు నేరుగా బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

### నిహారికకు డీఆర్ఎం సత్కారం



నిహారికను అభినందిస్తున్న డీఆర్ఎం

విశాఖ స్పోర్ట్స్ : ఆల్ ఇండియా రైల్వే బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన నిహారికను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ సత్కరించి ఐదు వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ పోటీలు బిలాస్‌పూర్‌లో జరగ్గా నిహారిక వాల్తేర్ డివిజన్‌లో గుమస్తాగా సేవలందిస్తున్నారు. మహిళ 81 కేజీల్లో మౌనిక, 52 కేజీల్లో సవిత చెరో రజతం సాధించారు. మెన్ 60 కిలోల విభాగంలో శ్యామ్‌కుమార్ , 81కేజీల్లో హర్ప్రీత్ చెరో కాంస్యపతకం సాధించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈకోర్సా సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, పలువురు బాక్సింగ్ కోచ్‌లు, రిఫరీలు పాల్గొన్నారు.

# సేఫ్టీలో నంబర్ 1 వైజాగ్



తెలుగు తల్లి ఫ్లైఓవర్

- ప్రమాదాల తగ్గుదలలో దేశంలో విశాఖ టాప్
- ఏడాదిలో 34.5 శాతం తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- ఆ తర్వాత స్థానాల్లో చెన్నై, పాట్నా, ముంబై
- 2021లో 2,339 ప్రమాదాల్లో 368 మంది మృత్యువాత
- 2022లో 1,531 యాక్సిడెంట్లలో 358కి తగ్గిన మరణాలు
- రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ నివేదిక వెల్లడి

**సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరం రోడ్డు సేఫ్టీలో ముందంజలో ఉంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ** నగరాలైన చెన్నై, పాట్నా, ముంబై నగరాలను సైతం పక్కకు నెట్టేసి నంబర్ వన్ స్థానాన్ని పొందింది. రోడ్డు రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో ఏటా జరిగే రోడ్డు ప్రమాదాల నివేదికను ఈ మంత్రిత్వ శాఖ విడుదల చేస్తుంటుంది. దీని ప్రకారం పది లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల్లో 34.5 శాతం రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ద్వారా మన విశాఖ నగరం మొదటిస్థానంలో ఉంది. 2021లో విశాఖ నగరంలో 2,339 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 2022లో 1,531 మాత్రమే జరిగాయి. 2021లో దేశంలో అత్యధిక ప్రమాదాలు జరిగిన 50 నగరాల్లో విశాఖ 2,339 ప్రమాదాలతో ఏడో స్థానంలో నిలిచింది. 2022లో అంతకుముందు సంవత్సరం (1,531 ప్రమాదాలు)తో పోల్చితే 808 ప్రమాదాలు 34.5 శాతంతో 22వ స్థానానికి వెళ్లింది. ఇక 2021లో రోడ్డు ప్రమాదాల్లో 368 మంది (15వ స్థానం) చనిపోగా, 2022లో ఆ సంఖ్య 358కి (18వ స్థానం) తగ్గింది. అలాగే ఈ ప్రమాదాల్లో గాయపడిన వారి సంఖ్య 2021లో 1,533 మంది (14వ స్థానం) కాగా, 2022లో 1,228 (22వ స్థానం)కి తగ్గారు. ఇక ప్రమాదాల తగ్గుదలను పరిశీలిస్తే.. 31.4 శాతంతో చెన్నై రెండో స్థానం, 28.4 శాతంతో పాట్నా మూడో స్థానం, 15 శాతంతో ముంబై నాలుగో స్థానంలో ఉన్నాయి.

**అతివేగం ప్రమాదాలే అధికం**

విశాఖ నగరంలో 2022లో జరిగిన అత్యధిక రోడ్డు ప్రమాదాలకు అతివేగమే కారణమని ఆ నివేదిక తేల్చింది. మొత్తం 1,531 ప్రమాదాల్లో 1,228 (83.14 శాతం) అతివేగం వల్లే జరిగాయని పేర్కొంది. ఈ ప్రమాదాల్లో 301 మంది మరణించగా 1,842 మంది గాయపడ్డారు. అలాగే రాంగ్ రూట్‌లో వాహనాలను నడపడం ద్వారా జరిగిన 27 ప్రమాదాల్లో తొమ్మిది మంది మృత్యువాత పడగా, 26 మంది గాయపడ్డారు. ప్రమాదాల్లో అత్యధికంగా 1,017 సరళ రహదారిపైన, 111 ప్రమాదాలు రోడ్ల మలుపుల్లో, 473 జంక్షన్ల వద్ద, 11 కల్వర్టులపైన జరిగాయి. ద్విచక్ర వాహన ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంది. 791 బైక్ ప్రమాదాల్లో 179 మంది చనిపోగా, 748 మంది గాయపడ్డారు. 51 ఆటో ప్రమాదాల వల్ల 13 మంది, 30 లారీ ప్రమాదాల్లో ఏడుగురు, 18 బస్సు ప్రమాదాల్లో నలుగురు, 418 ప్రమాదాల్లో 105 మంది పాదచారులు, ఇతర ప్రమాదాల్లో మరో 50 మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇక ఈ ఏడాది కూడా రోడ్డు ప్రమాదాల తగ్గుదల గణనీయంగానే ఉంది. 2022 ఆగస్టు వరకు 1,226 ప్రమాదాలు జరగ్గా ఈ ఏడాది ఆగస్టు ఆఖరు వరకు 766 రోడ్డు ప్రమాదాలు (37.52 శాతం తక్కువ) మాత్రమే జరిగాయి. ఇక మరణాల సంఖ్యను చూస్తే 2022 ఆగస్టు వరకు 362 మంది చనిపోగా, ఈ ఏడాది అదే సమయానికి 207 మంది (42.8 శాతం తక్కువ) మృత్యువాత పడ్డారు.

**రెండేళ్లలో రోడ్డు ప్రమాదాల వివరాలు ఇలా..**

| సంవత్సరం | ప్రమాదాలు | మరణాలు | గాయాలు |
|---|---|---|---|
| 2021 | 2,339 | 368 | 1,533 |
| 2022 | 1,531 | 358 | 1,288 |

### సంయుక్త తనిఖీలతో సత్ఫలితాలు



రవాణ, పోలీసు, జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సంయుక్తంగా తరచూ ముమ్మర తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, నిబంధనల ఉల్లంఘనపై రోజూ కేసులు నమోదు చేస్తున్నాం. ఒక్క డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులే 4200కి పైగా నమోదు చేశాం. రోడ్డు ప్రమాదాలపై జంక్షన్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల్లో సత్వరమే ఆస్పత్రులకు తరలిస్తున్నాం. వీరిని రక్షించిన వారికి రూ.5 వేలు రివార్డు ఇస్తున్నాం. 'విజన్ జీరో' నినాదంతో పనిచేస్తున్నాం. రోడ్ల విస్తరణ, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటుకు రూ.21 కోట్లు వెచ్చించాం. ఇవన్నీ వెరసి విశాఖలో రోడ్డు ప్రమాదాలు, మరణాల తగ్గుదల సాధ్యమైంది.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం

## దీపావళి సందడి



విశాఖ నగరంలో దీపావళి సందడి నెలకుంది. విక్రయానికి వివిధ ఆకృతుల్లో ప్రమిదలు సిద్ధమయ్యాయి. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్



## హైదరాబాద్ టు విశాఖ

**గ్రీన్ చానల్ ద్వారా ఆపరేషన్ పరికరాల తరలింపు**



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు తీసుకు వస్తున్న ఆపరేషన్ డివైజ్

గోపాలపట్నం: అత్యవసర సర్జికల్ డివైజ్‌ను విశాఖ విమానాశ్రయం నుంచి నగరంలోని ఇండస్ ఆస్పత్రికి గ్రీన్ చానల్ ద్వారా తరలించారు. చీడికాడ మండలం జిత్రవరానికి చెందిన సత్తిబాబు(52) అయోర్టిక్ ఎనూరిజమ్‌తో బాధపడుతూ.. ఇండస్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు అత్యవసర శస్త్ర చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాన్ని శుక్రవారం హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ తీసుకొచ్చారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్ పర్యవేక్షణలో గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఎస్కార్ట్‌గా ఈ పరికరాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు సత్తిబాబు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## 11 నుంచి 13 వరకు జూనియర్ కాలేజీలకు సెలవులు

దొండపర్తి: జూనియర్ కాలేజీలకు శనివారం నుంచి 13వ తేదీ వరకు సెలవులుగా రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ ప్రకటించారు. రెండో శనివారం, ఆదివారంతో పాటు 13వ తేదీ దీపావళి సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు రోజులు కాలేజీలు మూసివేయాలని సూచించారు. ఈ రోజులు ఎటువంటి ప్రత్యేక తరగతులు, పరీక్షలు, ఇతరత్రా కార్యకలాపాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా కాలేజీ నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యం



మధురవాడలో బైక్ నడుపుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

**ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు**

మధురవాడ : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రు.4 లక్షల 70 వేల కోట్లు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం 5వ వార్డులో గల 17 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగరంపాలెం గ్రామంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ ఒక్క 49వ వార్డు సచివాలయం పరిధిలోనే రు.19 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్రంలో 100 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసింది ఒక్క భీమిలి నియోజకవర్గమేనని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డులో విజయవంతంగా పూర్తయిన సందర్భంగా మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు ఆధ్వర్యంలో 300 బైక్‌లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పీఎంపాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద ప్రారంభమై కార్‌షెడ్, చంద్రంపాలెం, మధురవాడ, కొమ్మాది, మధురవాడ మార్కెట్ ద్వారా నగరంపాలెం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అవంతి బైక్ నడిపి అందరినీ ఉత్సాహపరిచారు.

## డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర

**ఈ నెల 20 నుంచి ఆటగాళ్ల నమోదు**

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. అమరావతి నుంచి శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో విశాఖ నుంచి జేసీ, సెట్విస్ సీఈవో కీర్తి పాల్గొన్నారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 26వ తేదీ వరకు ఐదు స్థాయిల్లో ఈ పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. వార్డు స్థాయి నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 20 నుంచి నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు జేసీ తెలిపారు. కాగా.. ఆడుదాం ఆంధ్రలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీతో పాటు ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు.

## వైఎస్సార్‌సీపీలో 150 మంది చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై నగరానికి చెందిన 150 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు ఎండాడలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఏయూ, గీతం వర్సిటీల విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు హేమంత్, సెక్రటరీ పులగం కొండా వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి, ముఖ్య నాయకులు పెంద్ర అప్పన్న, వెంకట రమణారెడ్డి, సంపత్ నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు తాటితూరు విద్యార్థి

**తగరపువలస:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు తాటితూరు హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి ఆర్.సుమంత్ ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లా స్థాయిలో వేములపూడి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్–14 విభాగంలో పాల్గొని ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా శుక్రవారం హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, పీఈటీ ప్రసాద్, టి.ఎస్.వి ప్రసాదరావు సుమంత్‌ను అభినందించారు.



# అలవోకగా అబద్ధాలు ఈనాడుకే చెల్లు

- సచివాలయాల సహాయకుల నియామకాలంటూ అసత్య కథనాలు
- కోట్లు దండుకుంటున్నారని తప్పుడు రాతలు
- ఈనాడు వార్తను ఖండించిన జీవీఎంసీ అధికారులు



ఈనాడులో వచ్చిన వార్త

**డాబాగార్డెన్స్:** లేనివి ఉన్నట్లు.. ఉన్నవి లేనట్లు రోత పుట్టించే రాతలు రాయడంలో పచ్చమీడియా రికార్డు సృష్టిస్తోంది. వార్డు సచివాలయాలకు సహాయకుల నియామకాలు.. అందుకు రూ.3 లక్షల చొప్పున వసూళ్లు.. గుంటూరు కేంద్రంగా ఓ కన్సల్టెన్సీ ద్వారా చేపడుతున్న ప్రక్రియతో జీవీఎంసీపై రూ.10.4 కోట్ల భారం అంటూ లేని వార్తను ఈనాడు వండి వార్చింది. సచివాలయాలకు గతంలో జరిగిన నియామకాలు తప్పితే.. ప్రస్తుతం ఎటువంటి పోస్టుల భర్తీ లేదు. అయినప్పటికీ గాలి వార్తలు రాస్తూ.. లేనిపోని ఆరోపణలు చేస్తూ.. ప్రభుత్వంపై కట్టు కథలు అల్లి.. బురద జల్లుతోంది. లేని పోస్టులు భర్తీ చేస్తున్నట్లుగా.. వాటిని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు అమ్ముకుంటున్నట్లుగా ఓ అవాస్తవ కథనాన్ని అచ్చేసింది. వాస్తవానికి 2019, 2020లో మినహా ఇప్పటి వరకు వార్డు సచివాలయాలకు సంబంధించి ఎటువంటి నియామక ప్రక్రియను చేపట్టలేదు. ప్రస్తుతం ప్రతీ సచివాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్త వారిని నియమించే అవకాశం లేదు. అయినప్పటికీ సహాయకుల నియామక ప్రక్రియను చేపడుతున్నట్లు ఈనాడు తప్పుడు కథానాన్ని అల్లేసింది. ఈ వార్తను జీవీఎంసీ ఉన్నతాధికారులు ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

**వాస్తవం ఇలా..**

జీవీఎంసీ పరిధిలో 572 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 2019, 2020లో సచివాలయ కార్యదర్శుల నియామకాలు జరిగాయి. అలాగే ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా గౌరవ వేతనంపై వార్డు వలంటీర్లను నియమించారు. మరే ఇతర సిబ్బందిని ఏ ప్రాతిపాదిక పైనా కూడా జీవీఎంసీ నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం చేపట్టే అవకాశం కూడా లేదని జీవీఎంసీ ఉన్నతాధికారులు తేల్చి చెప్పారు. ఈనాడులో ప్రచురించిన విధంగా ఎటువంటి సహాయకుల నియామకాలు జరగడం లేదని స్పష్టం చేశారు.

**ఇక ఆప్కాస్ విషయానికొస్తే..**

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఆప్కాస్‌ను ప్రారంభించింది. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను విలీనం చేసిన నాటి నుంచి 2022 డిసెంబర్ నాటికి 482 అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిని ఆప్కాస్ నియమావళి ఆధారంగా రోస్టర్ పాయింట్/రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో జీవీఎంసీ కౌన్సిల్, కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను నియమించి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల కాలంలో విశాఖలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, ఇతర ముఖ్య కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగు కోసం తాత్కాలిక ప్రాతిపదికన రోజువారీ వేతనంపై జీవీఎంసీ కౌన్సిల్, స్థాయీ సంఘం ఆమోదంతో స్థానిక మహిళా సహాయ సహకార సంఘాల ద్వారా అదనపు కార్మికులను నియమించుకున్నట్లు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తాత్కాలికంగా నియమించిన వీరిని.. పారిశుధ్య పనులు పూర్తయిన వెంటనే నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు.

# మంత్రి అమర్‌నాథ్‌తో జర్నలిస్టుల సంబరాలు


దీపాలతో మంత్రి అమర్‌నాథ్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై విశాఖలో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా జీవో విడుదలపై మంత్రి అమర్‌నాథ్‌ను మిందిలో కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ పారదర్శక నిర్ణయంతో జర్నలిస్టుల కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ మేరకు విశాఖలో జర్నలిస్టులు సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి బాణసంచా కాల్చారు. జర్నలిస్టుల కుటుంబాల్లో ఈ ఏడాది ముందుగానే సీఎం జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రావులవలస రామచంద్రరావు ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంత్రి అమర్‌నాథ్‌ను అభినందించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కామాలుద్దీన్ మౌలానా, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నరేష్ కిరణ్, రమేష్ రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు. మరో వైపు పాత్రికేయ కుటుంబ సభ్యులకు వారసత్వంగా వచ్చే ఆస్తులను పరిగణలోకి తీసుకోకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు మంత్రి అమర్‌నాథ్‌ను కోరారు.

# 36 మంది ఎస్‌ఐలకు స్థానచలనం


ఎస్‌ఐల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

**దొండపర్తి:** నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 36 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీ ప్రక్రియను చేపట్టారు. అలాగే ఎస్‌ఐల పనితీరు, వారి సమస్యలను పరిగణలోకి తీసుకొని సాధ్యమైన మేర వారు కోరుకున్న చోట నియమించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమస్యల్లో ఉన్న బాధితులకు అండగా నిలవాలని, సక్రమమైన, సమర్ధవంతంగా విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచాలని సూచించారు. డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీ(క్రైం) గంగాధరం, ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు తదితరులు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ప్రాధాన్యతల ప్రకారం బదిలీలు చేయడం పట్ల ఎస్‌ఐలు హర్షం వ్యక్తం చేశారు.

| ఎస్‌ఐ | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| కునుబిల్లి శ్రీను | టూ టౌన్ క్రైం | ద్వారకా లా అండ్ ఆర్డర్ |
| పి.నరసింహమూర్తి | ఆనందపురం లా అండ్ ఆర్డర్ | దిశ మహిళా స్టేషన్ |
| డి.రాము | త్రీ టౌన్ లా అండ్ ఆర్డర్ | పెందుర్తి లా అండ్ ఆర్డర్ |
| జి.మోహన్‌రావు | సిటీ వీఆర్ | పీసీఆర్ |
| టి.రుక్మంధరావు | ఆరిలోవ క్రైం | స్టీల్‌ప్లాంట్ క్రైం |
| మంతెన భరత్‌కుమార్‌రాజు | పద్మనాభం లా అండ్ ఆర్డర్ | టాస్క్‌ఫోర్స్ |
| ఎం.శ్రీనివాసరావు | టూ టౌన్ లా అండ్ ఆర్డర్ | దిశ స్టేషన్ |
| ఎ.మన్మధరావు | ఆనందపురం క్రైం | గాజువాక క్రైం |
| పి.పాపారావు | కంచరపాలెం ట్రాఫిక్ | సీఎస్‌బీ |
| ఎ.హరికృష్ణ | వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ | గాజువాక లా అండ్ ఆర్డర్ |
| ఎం.రఘురాం | ఆనందపురం ట్రాఫిక్ | సిటీ వీఆర్ (ఎంవీపీ క్రైంకు అటాచ్‌మెంట్) |
| డి.కాంతారావు | ఎయిర్‌పోర్ట్ క్రైం | దిశ స్టేషన్ |
| ఎ.విజయ్‌కుమార్ | టూ టౌన్ లా అండ్ ఆర్డర్ | గాజువాక ట్రాఫిక్ |
| డి.విశ్వనాథం | పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ | వన్‌టౌన్ ట్రాఫిక్ |
| జి.అప్పారావు | ఆరిలోవ లా అండ్ ఆర్డర్ | మల్కాపురం ట్రాఫిక్ |
| ఆర్.హెచ్.ఎస్.ఎస్.వి.కుమార్ | ఆరిలోవ ట్రాఫిక్ | సీఎస్‌బీ |
| ఎస్.సోమరాజు | పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ | పీసీఆర్ |
| కె.సురేష్‌కుమార్ | ఎంవీపీ క్రైం | పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ |
| ఎస్.రామమూర్తి | ద్వారకా ట్రాఫిక్ | వన్‌టౌన్ క్రైం |
| కె.శ్యాంసుందర్ | ఆనందపురం లా అండ్ ఆర్డర్ | న్యూపోర్ట్ లా అండ్ ఆర్డర్ |
| కె.నెమరంబాబు | మహారాణిపేట క్రైం | ఆనందపురం క్రైం |
| పి.శ్రీనివాసరావు | వన్‌టౌన్ క్రైం | గాజువాక లా అండ్ ఆర్డర్ |
| పి.అప్పలనాయుడు | గాజువాక ట్రాఫిక్ | మహారాణిపేట లా అండ్ ఆర్డర్ |
| ఎస్.నరసింగరాజు | గోపాలపట్నం క్రైం | సీఎస్‌బీ |
| డి.శ్రీనివాసరావు | మహారాణిపేట లా అండ్ ఆర్డర్ | దువ్వాడ లా అండ్ ఆర్డర్ |
| ఎస్.వెంకట భాస్కరరావు | వన్‌టౌన్ ట్రాఫిక్ | ద్వారకా ట్రాఫిక్ |
| ఎ.మన్మధరావు | న్యూపోర్ట్ లా అండ్ ఆర్డర్ | పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ |
| పి.తమ్మునాయుడు | పీసీఆర్ | పీసీఆర్ |
| ఎల్.శ్రీనివాసరావు | స్టీల్‌ప్లాంట్ క్రైం | సిటీ వీఆర్ (సైబర్ క్రైం అటాచ్‌మెంట్) |
| పి.శివ | ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్ | ఆనందపురం లా అండ్ ఆర్డర్ |
| జి.సంతోష్ | వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ | ఆనందపురం లా అండ్ ఆర్డర్ |
| జె.సురేష్ | పెందుర్తి లా అండ్ ఆర్డర్ | పద్మనాభం లా అండ్ ఆర్డర్ |
| ఇ.అప్పలరాజు | ద్వారకా లా అండ్ ఆర్డర్ | ఆనందపురం ట్రాఫిక్ |
| ఎం.సుదర్శనరావు | మల్కాపురం ట్రాఫిక్ | పీఎంపాలెం లా అండ్ ఆర్డర్ |
| యు.రూపవతి | దిశ స్టేషన్ | దిశ స్టేషన్ |
| కె.శంకరరావు | సిటీ టాస్క్‌ఫోర్స్ | టూ టౌన్ లా అండ్ ఆర్డర్ |

# బీచ్ సందర్శకుల భద్రతపై దృష్టి

### సీపీ రవిశంకర్


పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

**భీమునిపట్నం:** భీమిలి పోలీస్టేషన్‌ను పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం సందర్శించారు. ఇక్కడి లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ పోలీస్టేషన్లను పరిశీలించారు. ఆయా స్టేషన్‌ల్లోని కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ ఇతర సిబ్బందితో మాట్లాడుతూ కేసులను జాప్యం చేయకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. క్రైం స్టేషన్ వద్ద సీజ్ చేసి ఉన్న వాహనాలు పాడవకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ ట్రాఫిక్ ఉండే ప్రాంతాల వద్ద అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పిక్నిక్‌ల సీజన్ కావడంతో బీచ్ సందర్శకుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పోలీస్ పెట్రోలింగ్ నిరంతరం జరగాలని, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని సీపీ ఆదేశించారు.

# పలు రైళ్ల దారి మళ్లింపు

**తాటిచెట్లపాలెం:** విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి తెలిపారు. 13న హతియా–ఎర్నాకుళం(22837) సూపర్‌ఫాస్ట్, 14న హతియా–ఎస్ఎంవీ బెంగళూరు(12835) సూపర్‌ఫాస్ట్, 15న జసిద్ధి–తాంబరం(12376) సూపర్‌ఫాస్ట్, 16న టాటా–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, 17న టాటా–ఎస్ఎంవీ బెంగళూరు(12889) సూపర్‌ఫాస్ట్, 13 నుంచి 17వ తేదీ వరకు ధన్‌బాద్–అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, ఈ నెల 23, 25, 27, 28వ తేదీల్లో ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు విజయవాడ–ఏలూరు–నిడదవోలు మీదుగా కాకుండా వయా విజయవాడ–గుడివాడ–భీమవరం టౌన్–నిడదవోలు మీదుగా ప్రయాణిస్తాయి. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

# అన్వేషి.. ఓ ఫీల్ గుడ్ మూవీ


మాట్లాడుతున్న చిత్ర హీరో విజయ్

**బీచ్‌రోడ్డు:** మంచి ఫీల్ గుడ్ మూవీ 'అన్వేషి' అని ఆ చిత్ర హీరో విజయ్ ధరణ్ అన్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్రంలోని పాటలకు మంచి స్పందన లభిస్తోందన్నారు. కొత్త నటులతో భారీ బడ్జెట్‌తో నిర్మాత గణపతి రెడ్డి ఈ చిత్రం నిర్మించారన్నారు. సినిమా డైరెక్టర్ వి.జె.ఖన్నా మాట్లాడుతూ అన్వేషి సినిమాను ఈ నెల 17న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో ఊహించని ట్విస్టులు ఉంటాయన్నారు. మారేడుమిల్లి అడవుల్లో 47 రోజుల పాటు చిత్రీకరణ జరిపామన్నారు. హీరోయిన్ సిమ్రాన్ గుప్తా మాట్లాడుతూ అన్వేషి విభిన్నమైన సినిమా అన్నారు. కార్యక్రమంలో హాస్యనటుడు నాగ్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేమంగా చేరుకున్న మత్స్యకారులు


స్వగ్రామానికి చేరుకున్న మత్స్యకారులు

**పరవాడ:** తిక్కవానిపాలేనికి చెందిన ఆరుగురు మత్స్యకారులు క్షేమంగా తీరానికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివెరిసింది. ఈ నెల 8వ తేదీ రాత్రి 10 గంటలకు గ్రామానికి చెందిన దూడ నూకాలు, గంగులు, చేపల అప్పారావు, మహాలక్ష్మి, చేపల ముసలయ్య, పరదేశి ఒకే బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. రాత్రి సమయంలో పడవ కొంత ప్రయాణించిన తర్వాత ఇంజినీర్ మరమ్మతులకు గురైంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ రాక బహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వీచిన గాలులతో పడవ ఎటు ప్రయాణిస్తుందో అంతుచిక్కక వారు ఆందోళనలో పడ్డారు. తెల్లవారే సరిగి నడి సముద్రంలో ఉన్నట్లు గుర్తించారు. అప్పటికే వారి వద్ద ఉన్న మంచి నీరు తాగేశారు. తినడానికి, తాగడానికి ఎటువంటి ఆహార పానీయాలు లేక రెండు రోజుల పాటు ఆకలితో అల్లాడిపోయారు. రేవు పోలవరం తీరానికి చాలా దూరంలో ఉండగా సెల్ ఫోన్ సిగ్నల్ రావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి 12 గంటలకు బంగారమ్మపాలెం తీరానికి చేరుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు పడవతో పాటు మెకానిక్‌ను వెంటబెట్టుకుని శుక్రవారం ఉదయానికి బంగారమ్మపాలెం తీరానికి చేరుకున్నారు. ఇంజిన్‌కు మరమ్మతులు చేసి.. ఉదయం 10 గంటలకు మత్స్యకారులంతా క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నారని సర్పంచ్ చేపల మసేను వెల్లడించారు.

# అప్పన్నకు కంచు హనుమంత వాహనం వితరణ


కంచు హనుమంత వాహనానికి పూజలు నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు

**సింహాచలం:** వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి విశాఖకి చెందిన ఓ భక్తుడు సుమారు 75 కిలోల కంచుతో తయారుచేసిన హనుమంత వాహనాన్ని వితరణ చేశారు. సింహగిరిపై ఆలయ రాజగోపురం వద్ద శుక్రవారం ఈ వాహనాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ స్వామికి ఉన్న వాహనాలను భక్తులు సందర్శించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అర్చకుడు పెద్దరాజు, ట్రస్టుబోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్, డిప్యూటీ ఈవో సుజాత, ఏఈవో భ్రమరాంబ, సూపరింటిండెంట్ కనకరాజు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

# చోరీ కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్ట్

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్లలో ఇటీవల జరిగిన మూడు దొంగతనాల కేసుల్లో ఆరుగురు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు అందించిన వివరాలివీ.. సెక్టార్–1లోని ఎం. శ్రీనివాసరావు ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో 130 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి కలశం, రెండు మొబైల్స్‌తో పాటు ల్యాప్‌టాప్‌ను రికవరీ చేశారు. సెక్టార్–7లోని హేమంత్ లగ్రాయ్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో రెండు ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. సెక్టర్–7లోని 101 క్వార్టర్‌లో ఉంటున్న కె.ఆర్.ఎస్.నాయుడు క్వార్టర్‌లో జరిగిన దొంగతనం కేసులో మొబైల్ ఫోన్‌తో పాటు ఇంట్లో పోయిన నగదుతో నిందితులు కొన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో నిందితులుగా బీసీ రోడ్డు సీతారామ్ నగర్‌కు చెందిన ఓ మైనర్, దయాళ్‌నగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు, మల్కాపురం జై ఆంధ్ర కాలనీకి చెందిన ఓ మైనర్, అదే కాలనీకి చెందిన ఇమిడిశెట్టి భీష్మ(28), మునగపాక విక్రమ్ (19)లుగా గుర్తించారు. నలుగురు మైనర్లను నగరంలోని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. మిగిలిన ఇద్దరిని గాజువాక 8వ ఏసీఎంఎం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. వీరందరికీ 14 రోజుల పాటు కోర్టులు రిమాండ్ విధించాయి.

# బీఆర్‌టీఎస్ బాధితులందరికీ న్యాయం

### జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్


బాధితుడికి చెక్కు అందజేస్తున్న జీవీఎంసీ చీఫ్ సిటీప్లానర్ సురేష్, అధికారులు

**సింహాచలం:** అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలి పావంచా నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ హామీ ఇచ్చారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో బాధితులకు శుక్రవారం నష్ట పరిహారం చెక్కులు అందించారు. అయితే కొంత మంది చెక్కులు తీసుకునేందుకు నిరాకరించారు. తమకు సరైన న్యాయం చేయడం లేదని.. న్యాయం జరిగిన తర్వాతే చెక్కులు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో అధికారులు, బాధితుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం చీఫ్ సిటీ ప్లానర్ విలేకరులతో మాట్లాడుతూ బాధితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకే తామంతా కృషి చేస్తున్నామన్నారు. బాధితులపై ఎటువంటి ఒత్తిడి చేయడం లేదన్నారు. రోడ్డు విస్తరణ జరగడం వల్ల చేకూరే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని ట్రాఫిక్ పెరుగుతున్న దృష్ట్యా.. గిరి ప్రదక్షిణ, తదితర ఉత్సవాల కారణంగా తొలిపావంచా నుంచి పాత అడవివరం వరకు ఉన్న రోడ్డును సత్వరం విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓనర్‌షిప్‌లు లేకపోయినా బాధితులందరికీ టీడీఆర్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణ నష్ట పరిహారం కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయే వారికి సంబంధించి ప్రత్యామ్నాయంగా స్థలాలు ఇచ్చే విషయం రెవెన్యూ పరిధిలో ఉందన్నారు. కాగా.. బాధితులు ఇటీవల కలెక్టర్ మల్లికార్జునను కలిసి తమ సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నగర డీసీపీ పద్మజ, సీపీ మహాలక్ష్మిదొర, బీఆర్‌టీఎస్ స్పెషల్ ఆఫీసర్ చక్రవర్తి, జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏసీపీలు వెంకటేశ్వరరావు, రఘునాథరావు, టీపీవో తేజ్ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ బులియన్

| | |
|---|---|
| 24 క్యారెట్స్(10 గ్రా.) | రూ.61,090 |
| 22 క్యారెట్స్(10 గ్రా.) | రూ.56,000 |
| వెండి(కిలో): | రూ.77,000 |

### చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

| | |
|---|---|
| ఫారం | : రూ.82 |
| బ్రాయిలర్ (లైవ్) | : రూ.102 |
| స్కిన్ | : రూ.174 |
| స్కిన్‌లెస్ | : రూ.184 |